దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్‌: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మల్కాజిగిరి ఫైన్‌ ఆర్ట్స్‌ పాఠశాలలో 2025–2026 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎదులాబాద్‌లోని లలిత కళల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రాములు, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాము తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 1, 2025 లోపు కులం, పుట్టిన తేది, ఆదాయం సర్టిఫికేట్‌, ఆధార్‌ కార్డు, ఒక ఫొటో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 23న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా మల్కాజిగిరి

ఎంపీ ఈటల రాజేందర్‌



మేడ్చల్‌: మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గంను నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా మార్చేందుకు కృషి చేస్తున్నానని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. పూడూర్‌ పరిధిలోని ఆయన నివాసంలో నిరుద్యోగ రహిత మల్కాజిగిరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో హుజురాబాద్‌, గజ్వేల్‌ నియోజకవర్గాలలో ఇంటింటి సర్వే చేసి ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారో తెలుసుకుని సమగ్ర నివేదిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల వెయ్యికి తగ్గకుండా ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా సంస్థ పని చేస్తుందన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ఘట్‌కేసర్‌: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వివిధ విధులు నిర్వహించి అలరించారు. హెచ్‌ఎంగా వరుణ్‌, డీఈఓగా విశాల్‌, ఎంఈఓగా యుగేందర్‌ విధులు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం పాపిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపాధ్యాయుల విధులపై అవగాహన కల్పించడానికి స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైత్రేయి, కృష్ణవేణి, కృష్ణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

మందుల సరఫరా లేదు

మేడ్చల్‌: మేడ్చల్‌ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, బస్తీ దవాఖానాలో సాధారణ మందులు అందుబాటులో ఉండటంలేదని రజక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బీపీ వంటి మందులు కూడా అందుబాటులో ఉండటంలేదని ఈ విషయంపై జిల్లా కలక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశామని.. రెండు రోజుల్లో అన్నీ మందులు అందుబాటులో ఉంచుతామన్నారని, కానీ ఆసుపత్రిల్లో మందులు అందుబాటులో ఉంచడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని కోరారు.

దరఖాస్తు గడువు మార్చి 31 వరకు పొడిగింపు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిరి జిల్లాలోని పలు కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్‌ కులాల విద్యార్థినీ/విద్యార్థులు 2024–25 సంవత్సరానికి పోస్ట్‌–మెట్రిక్‌ ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31 వరకు పొడగించినట్లు జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాల కోసం ఆయా కళాశాలల్లో ఈ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులు కొత్తగా రిజిస్ట్రేషన్‌/గతంలో అడ్మిషన్‌ పొంది చదువును కొనసాగిస్తున్న విద్యార్థులు రెన్యువల్‌ రిజిస్ట్రేషన్‌ ఈ పాస్‌ వెబ్‌సైట్‌ నందు రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని ఆయన సూచించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో చదువుతున్న వారిలో అర్హులైన విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిజిటల్‌ కీ కోసం కాలేజీ యాజమాన్యం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్‌ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ జిల్లా నూతన కార్యవర్గం

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్‌ అసోసియేషన్‌ మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడుగా పృథ్వీ నియమితులయ్యారు. అసోసియేట్‌ అధ్యక్షుడుగా నవీన్‌ రెడ్డి, సంపత్‌, ఉపాధ్యక్షులుగా సునీల్‌, దుర్గాభవాని, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులుగా సైదిరెడ్డి ఫారుక్‌, కార్యదర్శులుగా చంద్రకళ, నవీన్‌, మహేందర్‌, అభిలాష్‌, సంయుక్త కార్యదర్శులుగా బలరాం, వినయ్‌, రవి, విజయ్‌కుమార్‌ తదితరులు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మహేందర్‌, వినయ్‌, నరసింహ, రతన్‌ రాజా ఎన్నికయ్యారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం ప్రకటించారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి తెలంగాణ తహసీల్దార్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్‌ పాక, సెక్రెటరీ జనరల్‌ ఫూల్‌ సింగ్‌ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీజీటీఏ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు రాజేష్‌, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌, అసోసియేట్‌ అధ్యక్షుడు రాజేశ్వర్‌ రెడ్డి పాల్గొన్నారు.



గొడవెల్లి ఆలయంలో పూజలు



చీర్యాలలో.. స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తజనం



సుదర్శన నరసింహ హోమం



ఎదులాబాద్‌లో.. శ్రీ రంగనాయక స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు

- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం
- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు
- ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం

మేడ్చల్‌: వైకుంఠ ఏకాదశి పండగను మేడ్చల్‌ మండలంలో, మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జయదర్శిణి వెంకటేశ్వర ఆలయాలు, మేడ్చల్‌ రంగనాయక స్వామి, గుండ్లపోచంపల్లి లక్ష్మీనారాయణ, అయ్యప్ప ఆలయం, గొడవెల్లి రామానుజస్వామి ఆలయం తదితర ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీ వారు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను తోరణాలతో, పూలతో, విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువ జాము నుంచే వివిధ ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, లక్ష పూలఅర్చనలు, హోమాలు, వంటి ఎన్నో విశేష కార్యక్రమాలు నిర్వహించారు.

కీసర: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహాస్వామి, దమ్మాయిగూడ వెంకటేశ్వర స్వామి, కీసర రామాలయం, కీసరగుట్టలోని శ్రీ లక్ష్మీనృసింహాస్వామి, రాంపల్లి రామాలయం, నాగారం సత్యనారాయణ స్వామి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలను పండితులు నిర్వహించారు. చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహాస్వామి దేవాలయంలో కొలువైన శ్రీస్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, తులసి, లక్ష పుష్పార్చన, సప్తహారతులు, సుదర్శన నరసింహహోమం తదితర పూజలను కన్నుల పండువగా



కీసర.. ఆలయంలో కొలువైన శ్రీస్వామివారు

అర్చకులు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు చీర్యాల ఆలయానికి తరలివచ్చి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సప్తద్వారాల గుండా స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఈ సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌ పాల్గొన్నారు.

స్వామిసేవలో తెలంగాణ రాష్ట్ర ల్యాండ్‌ రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ ప్రిన్సిపాల్‌ సెక్రటరీ నవీన్‌మిట్టల్‌ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. దర్శనానంతరం నవీన్‌మిట్టల్‌ దంపతులకు అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలతోపాటు, మహాప్రసాదాన్ని అందజేయగా, ఆలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ,



మేడ్చల్‌లో.. రంగనాయక స్వామి

ధర్మకర్త శ్రీహరిగౌడ్‌ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ చైర్మన్లు, కొకుట్లచంద్రారెడ్డి, ప్రణితాగౌడ్‌, వైస్‌ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్‌, మాజీఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో...

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలో కొలువైన అక్కన్న మాదన్న కాలంనాటి శ్రీ విష్ణు శివాలయంలో ఉత్తర దర్శనం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌, మేడ్చల్‌



ఉద్దమర్రిలో.. స్వామివారిని దర్శించుకుంటున్న వజ్రేష్‌యాదవ్‌, తదితరులు



యంనంపేట్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్‌ మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, పేట్‌ బషీరాబాద్‌ రాములు, ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్‌గౌడ్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌, మేడ్చల్‌ జిల్లాలోని పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

మున్సిపాలిటీలో ముక్కోటి ఏకాదశి పర్వదినం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గీతామందిర్‌, ఎదులాబాద్‌ శ్రీగోదా సమేత శ్రీ రంగనాయక స్వామి, వేమనగర్‌లోని శ్రీదేవి–భూదేవి సమేత శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. స్వామి వారికి చందనం, పుష్పాలు, తులసి దళాలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి హారతులిచ్చి గాజులు, ఒడి బియ్యం, అన్నదానం చేసి, భక్తి శ్రద్ధలతో ఉపవాసం చేపట్టారు. ముక్కోటి ఏకాదశి వేడుకల్లో ట్రస్ట్‌ సభ్యులు వేంకటరమణమూర్తి, లక్ష్మీమోహన్‌, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



స్వామిసేవలో నవీన్‌మిట్టల్‌ దంపతులు



స్వామివారికి లక్షపుష్పార్చన పూజ



కీసరలోని.. రామాలయం వద్ద ఏకాదశి పూజలు



కొండాపూర్‌లో.. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నోరూరించే వంటలతో ఫుడ్‌ ఫెస్టివల్‌



పోచారం: కొర్రెముల్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోషక విలువల గురించి తెలియజేయడానికి శుక్రవారం ఫుడ్‌ ఫెస్టివల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నోరూరించే వంటకాలను తయారు చేశారు. స్కూల్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన 47 స్టాల్స్‌లో విద్యార్థులు వండిన ఆహార ప్రదార్థాలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలకు తాము తయారు చేసిన వంటల విధానాన్ని వివరించి, వాటి ద్వారా లభించే పోషకాల గురించి తెలిపారు. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పర్యవేక్షించారు. నిర్వాహకులుగా టీచర్లు మాధవీలత, ప్రశాంతమణి, సుహాసిని, బాల్‌రాజ్‌ వ్యవహరించారు.

మున్సిపల్‌ అభివృద్ధికి కృషి

కీసర: నాగారం మున్సిపాలిటీని నెంబర్‌వన్‌ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు గత 5 ఏళ్లగా కృషి చేయడం జరుగుతోందని మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్‌ పరిధిలోని 18వ వార్డులోని అన్నమయ్య కాలనీలో సుమారు 35 లక్షల మున్సిపల్‌ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో కౌన్సిలర్ల సూచన మేరకు అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల



చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్లు హరిబాబు, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే ఆనందం

జవహర్‌నగర్‌: సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందని మెర్సి హ్యాండ్స్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షురాలు కెరోలిన్‌ అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రభుత్వ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు బొమ్మలు, వాటర్‌ బాటిళ్లను వంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెరోలిన్‌ మాట్లాడుతూ.. మెర్సి హ్యాండ్స్‌ ఫౌండేషన్‌ ద్వారా పేదలకు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా



ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌, ఉపాధ్యాయురాలు పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పిల్లవాడిలో ప్రత్యేకమైన మేధస్సు ఉంటుంది

పోచారం: పిల్లలకు చదువుతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యాలను పెంచేలా పాఠశాల యాజమాన్యాలు కార్యక్రమాలను నిర్వహించాలని ప్రముఖ అర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ భరత్‌ సూచించారు. శుక్రవారం చౌదరిగూడలోని రోటర్‌ డ్యామ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో జరిగిన గ్రాడ్యుయేషన్‌ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌ మాట్లాడుతూ.. ప్రతి పిల్లవాడిలో



ప్రత్యేకమైన మేధస్సు ఉంటుందని, పిల్లలను ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఎదగనివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి.

భూకబ్జాను అడ్డుకున్న రైతులు


పోచారం: కాచవానిసింగారం పరిధిలోని ముత్వెల్లిగూడలో భూమిని కబ్జా చేస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ముత్వెల్లిగూడలోని సర్వే నెంబర్‌ 83లోని భూమి తమ పూర్వీకుల నుంచి వచ్చిందని, ఇందులో పశువుల దొడ్లు వేసుకొని దాదాపు 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఈ భూమిని కబ్జా చేసేందుకు నగరానికి చెందిన సింగిరెడ్డి సురేందర్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, మక్తాకు చెందిన శివ ప్రయత్నిస్తున్నారన్నారు. కబ్జాలో భాగంగా శుక్రవారం జేసీబీలతో పనులు చేయిస్తున్నారని, దౌర్జన్యంగా తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకోవడంతో పరారయ్యారని బాధితులు బుర్ర నర్సింహ, మట్టా విష్ణుగౌడ్‌, శ్రీనివాస్‌, రంగయ్య, శ్రీనివాస్‌, పాండురంగం తదితరులు తెలిపారు. చెట్ల కూల్చివేతల గురించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, కబ్జాదారులపై మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం

మేడ్చల్‌: మేడ్చల్‌ మండలంలోని అన్నీ గ్రామాలలో బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటుతామని బీజేపీ మండల నూతన అధ్యక్షుడు ఎక్కాలదేవి శ్రీశైలం అన్నారు. ఆయనను మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించబడిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్నీ గ్రామాలలో బీజేపీని మరింత పటిష్టం చేస్తామన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు





రాంపల్లి జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో... సంబరాల్లో విద్యార్థులు తదితరులు

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ పద్మజరావు మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరుపుకునే సంక్రాంతి పండుగ విశేషాల గురించి, పండుగను ఎలా జరుపుకుంటారనే విషయాన్ని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఇతర కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

మేడ్చల్‌లో..

మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులు ముందస్తు సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి, రంగురంగుల ముగ్గులు వేసి, పతంగులు ఎగురవేశారు. పల్లె వాతావరణం ఏర్పాటు చేసి గోపూజలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో ప్రధాన ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాక్‌ఉడ్స్‌లో..

కీసర: నాగారంలోని రాక్‌ఉడ్స్‌ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ పద్మ అయ్యంగార్‌ నేతృత్వంలో సంప్రదాయ పూజా విధానంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సంగీత, నృత్య, నాటిక రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్‌ చైర్మన్‌ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్‌ పద్మ అయ్యంగార్‌ తదితరులు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో సంక్రాంతికి ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



అత్వెల్లి పాఠశాలలో.. ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



జవహర్‌నగర్‌లోని.. హోలి జ్యోన్‌ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినిలు



రాక్‌ఉడ్స్‌లో..



మేడ్చల్‌లోని బచ్చన్‌ప్లే స్కూల్‌లో..